
శ్రీమతి శుభ



# ఒక కుందేలు కథ

వాళ్ళిద్దరూ— ఢీకొని తలలు పగలగొట్టు కోడానికి సిద్ధంగావున్న పొట్టేళ్ళలాగ ఒకరినొకరు చూసుకున్నారు కొమ్ములు విరగొట్టుకోడానికి సిద్ధంగావున్న కోడెదూడల్లా హుంకరించారు ఒకరు పడగవిప్పిన నాగులా బుసకొట్టగా మరొకరు ముంగిసలా కాలుదువ్వుతున్నాడు వాళ్ళిద్దరూ— ఒకరు తండ్రి— ఒకరు కొడుకు, ఒకరు ఎన్. జి వో— ఒకరు నిరుద్యోగ పట్టభద్రుడు!

ఆ గదిలో ఒకమూల పిల్లిలా నక్కి చూస్తున్న ఆ ప్రాణి— పార్వతమ్మ! ఆమె ఎన్ జి. వోకి భార్య. నిరుద్యోగికి తల్లి! ఆమెకు ఏ విషయంలోనూ స్వతంత్రం లేదు ఆమెమాట పెదవిదాటదు. కాలు గడప దాటదు.

ఆ తండ్రి కొడుకులను చూస్తే ఆమెకు ఆశ్చర్యం వేస్తుంది. వీళ్ళు తండ్రికొడుకులా, ఆగర్భ శత్రువులా— అని అనుమానం కలుగుతూ వుంటుంది ఆయన ఉత్తిపుణ్యానికి కొడుకుని తిడుతూ ఉంటారు అందరు తండ్రులూ అంతే కదా! మరి అందరి కొడుకుల్లా నోరు మూసుకొని పడివుండడు కృష్ణ తండ్రిని ఎదిరిస్తాడు నువ్వెంత అంటే నువ్వెంత అని నిలదీస్తాడు తండ్రి అన్న గౌరవం అసలే చూపడు.

ఆ తండ్రి కొడుకుల ఘర్షణ మధ్య తల దూర్చితే మద్దెలలాగ అవుతుంది ఆమె పరిస్థితి. అటూ యిటూ తల బొప్పి కడుతుంది. అందుకే మౌనమే శరణ్యం ఆమెకు

మిగిలిన యిద్దరు పిల్లలూ బుద్ధిమంతులే! అయితే కృష్ణ బుద్ధిమంతుడు కాదా అని ఎవరైనా అడిగితే చప్పున సమాధానం చెప్పలేదు పార్వతమ్మ! కృష్ణ తనకే కాదు ఎవరికీ అర్థం కాని యువకుడు.

వాడెందుకలా తయారయ్యాడో!

గత ఫిబ్రవరిలో ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సు హటాత్తుగా తగ్గించింది ఉద్యోగులకా వార్త అశనిపాతం అయింది ఆ వార్త వినగానే కొందరు ప్రాణాలు కోల్పోతే — అర్ధంతరంగా రిటైర్ అయిపోతే జీతాలు కట్టలేమన్న బాధతో మెడిసిన్, ఇంజనీరింగ్ చదువుతున్న కొడుకుల చదువు మాన్పించేసారు కొందరు. ఎదిగిన కూతుళ్ళ పెళ్ళి ఎలా చేయాలో తెలియక బెంగపడ్డారు కొందరు.

ఆ నెలలోనే రిటైర్ అయిన చాలమంది— చేతిలో కూడు ఎవరో తన్నుకుపోయినట్లు ఖిన్నులయారు నోటిముందు కూడు పడగొట్టిన ప్రభుత్వాన్ని శపించారు

రిటైర్‌మెంటు వయస్సు తగ్గినా, శంకరయ్యకి యింకా ఒక సంవత్సరం సర్వీసు వుంది కొడుకుల్లో ఒక్కరికీ ఉద్యోగం లేదు కూతురుకి యింకా సంబంధం నిశ్చయంకాలేదు. ఒక్క ఏడాదిలో అవి నెరవేరేనా ? అని చింత పట్టుకుందాయనకు

ఇంటిల్లిపాదీ అందరూ విచారంలో మునిగిపోతే కృష్ణ మాత్రం నవ్వుకున్నాడు ! "మంచి శాస్తి జరిగింది ! ఈ ముసలాళ్ళు ఆఫీసుల్లో అసలు పని చేస్తున్నారా ఏమిటి ?!"

ఉద్యోగులు సుప్రీమ్ కోర్టులో రిట్ వేస్తే "రిటైర్‌మెంట్ వయస్సు పెంచడాన్కి అధికారంవున్న ప్రభుత్వానికి తగ్గించడాన్కి ఉండదా ? మీరు ఓడిపోతారు !" అని వాదించడం మొదలుపెట్టాడు

తర్వాత ప్రభుత్వం ఫండమెంటల్ రూల్‌ని సవరించడంతో ఉద్యోగులు సమ్మె నోటీసు యివ్వడం, ఇరుపక్షాలా ప్రచారం ఉధృతం కావడం, హద్దులమీరి అందరూ ఒకరి నొకరు దుయ్యబట్టుకోవడం ప్రారంభంకాగా — శంకరయ్య యిల్లు ఒక రణరంగంగా మారింది !

శంకరయ్య ఆ జిల్లా ఎన్ జీ వో ల కార్యదర్శి సహజంగానే ఆయన శక్తి కొద్దీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టి యింటికిరాగానే కృష్ణ ఆయనతో వాదనకు దిగేవాడు ప్రభుత్వం నియమించిన ప్రతినిధి లాగ విమర్శించేవాడు

"కోర్టులో రిట్‌వేసి, తీర్పు రాకుండానే సమ్మె ఎందుకు ?" నిగ్గదీసి అడిగాడు కృష్ణ

"కోర్టులో వున్నది రిటైర్‌మెంట్‌కు సంబంధించిన కేసుమాత్రమే .. ఇంకా చాల కోరికలున్నాయి" అన్నాడు కసరుతున్నట్లు

కాని ఆయన కోపం చూసి బెదిరిపోలేదు కృష్ణ గత నాలుగురోజుల దినపత్రికలు ఆయనమీదకు విసిరాడు వాటిలో పతాక శీర్షికలు — ఒక దానిలో — "రిటైర్‌మెంట్ విషయంలో రాజీ ప్రసక్తిలేదు" మర్నాటి పేపర్‌లో — "ఆర్డినెన్స్ ఉపసంహరిస్తే చాలు" ఆ తర్వాత — "రిటైర్‌మెంట్, ఆర్డినెన్స్ — రెండే ప్రధానాంశాలు" ఆ మర్నాడు — "ఆ రెండు అంశాలేకాక యితర అంశాలమీద కూడా రాజీ ప్రసక్తిలేదు "

అవన్నీ చదివి వినిపించి "అసలు మీరు నిజంగా దేనికోసం సమ్మె చేస్తున్నారో మీకైనా సరిగా తెలుసా ?" గద్దించాడు కృష్ణ

ఈ కుర్రకుంకకు చెప్పేదేమిటి — అనుకున్నాడు శంకరయ్య కాని కొడుకు రెచ్చగొట్టే ధోరణిని సహించలేకపోయాడు "మేం కోర్టుల్లో పోరాడుతాం వీధుల్లోనూ పోరాడుతాం" అక్కసుగా అన్నాడు.

ఆ తర్వాత యిద్దరూ ఒకర్ని ఒకరు మింగేసేటట్టు చూసుకున్నారు పామూ, ముంగిసల్లా బుస కొట్టారు కృష్ణ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు

అప్పుడే ఐదారుగురు కాలేజీ కుర్రాళ్ళు అలా వెళుతున్నారు వాళ్ళతో గబగబ ఏదో చర్చించాడు కృష్ణ. వాళ్ళంతా గుంపుగా యింట్లో జొరబడ్డారు.

"ఏం పెద్దమనిషివయ్యా ?! వయసొచ్చిన కుర్రాడికి అనేక ఖర్చులుంటాయి నెలనెలా పాతికో ముప్ఫయో పాకెట్ మనీ యివ్వాలని తెలియదా ?" శంకరయ్యను గద్దించి అడిగాడొకడు. "పాకెట్ మనీ యివ్వలేని తండ్రి పిల్లల్నెందుకు కనాలి ?" దీర్ఘం తీసాడు మరొకడు చటుక్కున శంకరయ్య జేబులోని పర్స్ లాక్కుని దానిలోంచి పాతికరూపాయలు తీసి కృష్ణ కిచ్చాడు యింకొకడు.

"తండ్రులూ ! డవున్ డవున్" కేకలతో యిల్లు దద్దరిల్లిపోయింది

గోల విని ఇరుగు పొరుగు వాళ్లంతా గుమిగూడారు ఏమీ చేయలేక శంకరయ్య తల వంచేసాడు అతని హృదయం కుత కుత ఉడికిపోతోంది ఆ కుర్రాళ్ల అరుస్తూనే శంకరయ్య చొక్కా పట్టుకుని అటూ యిటూ గుంజారు. ఆయన్నొక బంతిలాగా ఒకరి మీదకు యింకొకరు తోసివేయడం మొదలు పెట్టారు. ఆ ముచ్చట ఐదునిమిషాలపాటు జరిగాక ఎవరి దారిన వాళ్లు వెళ్లారు

ఇరుగు పొరుగు వాళ్లు — కొందరు నవ్వుకుంటే మరికొందరు శంకరయ్యను ఓదార్చారు "యువతరం !" వెటకారంగా అన్నారు కొందరు శంకరయ్య హృదయం భగ్గుమంది. కృష్ణ వైపు కొర కొర చూసాడు

"వీధుల్లో పోరాడుతాం—అన్నారు మీరు ఆ పనే నేను చేసాను ఎందుకా కోపం ?" నవ్వేసాడు కృష్ణ గునపంతో గుండెల్లో పొడిచినట్టు బాధపడిపోయాడు శంకరయ్య. ఆ బాధతో ఆయన ఆ రాత్రి భోజనం చేయలేదు బెడ్ రూంలో దూరి తలుపులు బిగించుకున్నాడు

మరో రెండు రోజులకు— అధికార పార్టీకి చెందిన యువకులు ఎన్ జీ వో నాయకుని వేధించినట్లు అన్ని దినపత్రికల్లోనూ వార్త వచ్చింది . తండ్రి వైపు కొర కొర చూసాడు కృష్ణ !

మరో రెండురోజులకు— స్థానిక ఎన్ జీ వో కార్యదర్శి ప్రతిపక్షాల నుండి నిధులు అందుకున్నట్టు కొన్ని పత్రికలు ప్రకటించాయి కొడుకు వైపు కసిగా చూసాడు శంకరయ్య !

"నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష !" కిసుక్కున నవ్వాడు కృష్ణ !

ప్రభుత్వం ఎన్ జీ వోలను పందికొక్కులుగా వర్ణించిందట వాళ్ల తోలు ఒలిచేస్తాం అందట. దానితో ఉద్యోగ సంఘాలన్నీ అట్టుడికిపోయాయి ప్రభుత్వాధినేతలే పెద్ద పందికొక్కులు. ప్రభుత్వం తోలు మేమే ఒలిచేస్తాం మూడు ప్రభుత్వాలను పడగొట్టాం ఈ ప్రభుత్వం ఒక లెక్కా ?! — ఈ ధోరణిలో సంఘం నాయకుల ప్రసంగాలు కొనసాగాయి

ఆవేశంగా ఉపన్యసించి ఎన్.జీ వో లందరి చేతా సమ్మెలోపాల్గొంటామని ప్రతిజ్ఞ చేయించి — ఉత్సాహంగా యింట్లో అడుగు పెట్టాడు శంకరయ్య

తండ్రికోసం ఎదురు చూస్తున్న కృష్ణ ఎదురొన్నాడు "గుండెమీద చేయివేసుకుని నిజం చెప్పు నాన్నా ! నీవు రోజూ ఎన్నిగంటలకు ఆఫీసుకు వెళ్తున్నావు ? వెళ్ళిన తర్వాత ఎన్ని గంటలకు ఫైల్స్ తెరుస్తున్నావు ? రోజుకి ఎన్నిగంటలు నీవు పని చేయాలి ? ఎన్నిగంటలు చేస్తున్నావు ? ఆమ్యామ్యా చెల్లించనిదే ఏ పని అయినా చేసావా ? మీ ఆఫీసులో నీవొక పందికొక్కువు కాదా ? నీలాగ పనిచేయకుండా జీతం తీసుకునే పందికొక్కులు మీ ఆఫీసులో ఎన్ని ఉన్నాయో నిజంగా నీకు తెలియదా ? నేను హైస్కూలులో చదివే రోజుల్లో కేస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికేట్ల కోసం వాళ్ళు నిన్ను ఎన్ని రోజులు తిప్పారు ? అప్పుడు నీవు వాళ్ళని పందికొక్కులని తిట్టలేదా ? ఇప్పుడెవరో అలా అన్నారని ఎందుకా చిందులు ? ఉన్నమాటంటే ఉక్రోషం !"

కృష్ణ అలా నిలదీసి అడిగితే శంకరయ్య వద్ద నిజంగా సమాధానం లేదు కుర్రకుంకకు సమాధానం చెప్పవలసిన అగత్యమూ లేదు విసురుగా లోనికి వెళ్ళిపోయాడు కృష్ణ ఊరుకోలేదు ఆయన్ని వెంబడించాడు—సమాధానం చెప్పితీరాలన్నట్లు

"కొద్దిమంది అలాంటి వాళ్ళుండవచ్చు అలాని అందర్నీ కలిపి తిట్టడం ఏం న్యాయం ?" అన్నాడు శంకరయ్య — ప్రభుత్వం తిట్టింది కాబట్టే మేమూ తిట్టాం అన్న ధోరణిలో కృష్ణ ఒక్కసారిగా రెచ్చిపోయాడు. "ఒరే గాడిదా ! బుద్ధి లేదా ? ఇంత తిని ఊరంతా బలాదూర్ తిరగడం గాడిదలు చేసే పనిరా అడ్డగాడిదా !" అని గర్జించాడు

శంకరయ్య నిశ్చేష్టుడయాడు ముఖం కందగడ్డ అయింది రక్తం కుతకుత ఉడికిపోయింది. ఇంటిల్లిపాది అందరూ చుట్టూ బొమ్మల్లా నిలచిపోయారు

కృష్ణ నవ్వేసాడు " అలా మీరు నన్ను తిట్టేవారు ! అలాని నేను కూడా మిమ్మల్ని అలా తిట్టడం నాయ్యమా ? మీరే చెప్పండి" అన్నాడు సంతృప్తిగా తర్వాత— ఒక మహా సత్యాన్ని ఆవిష్కరిస్తున్న వాడిలా చుట్టూ చూసి "నీవు వెధవ— అంటే నీవు వెధవ— అని వీధిలోపడి అరచుకుంటే — చూసేవాళ్లు, యిద్దరూ వెధవలే అనుకుంటారు !" అని తాపీగా వెళ్ళిపోయాడు.

సమ్మె ప్రారంభం అయింది మున్నెప్పుడూ లేని సంచలనం తెచ్చింది. కాసెట్లు జోరు, పోస్టర్ల యుద్ధంతో బాటు వార్తా పత్రికల సమరంకూడా తారస్థాయికి చేరుకుంటున్నాయి కొత్త గవర్నర్ పేరు ప్రకటించబడడం, రాష్ట్రపతి పర్యటనలో పరిస్థితి వేడెక్కింది. రాష్ట్రపతి పాలన ఖాయం అన్న ధోరణి ఉద్యోగుల్లో కనిపించింది

సమ్మె సర్వత్రా జయప్రదం అయింది

రాష్ట్ర పరిస్థితి అలా వుంటే శంకరయ్య యింటి పరిస్థితి మరింత రాజుకుంది రాజేసిన వాడు కృష్ణ!

కృష్ణతోబాటు చాలమంది నిరుద్యోగులు కలక్టర్ ఆఫీసు చుట్టూ ఉద్యోగాలకోసం రెండు రోజులు తిరిగారు ఎవరికీ ఉద్యోగాలు రాలేదు గాని వారిని సమ్మెదారులు ఎదుర్కోవడం—దానితో ఘర్షణలూ పెరిగాయి! కృష్ణకు ఉద్యోగం దొరకనందుకు శంకరయ్య సంతోషించాడు!

మొదటి నుండీ కృష్ణ—సమ్మె జయప్రదం కాదని వాదిస్తూ వుండేవాడు గత కొద్ది రోజులుగా స్తబ్దుగా ఉండిపోయాడు శంకరయ్యలో ఉత్సాహం పుంజుకుంది కొడుకు మీదకు వార్తాపత్రికలు విసిరాడు "చూడు! పత్రికలన్నీ— ఒకటి, రెండు తప్ప— మా సమ్మెను ప్రోత్సహిస్తున్నాయి!" అన్నాడు సగర్వంగా

"అవన్నీ ప్రతిపక్షాలు నడుపుతున్న పత్రికలు! జీతానికి అమ్ముడుపోయే సంపాదకులు అలాగే రాస్తారు . ఆ పత్రికల కార్యాలయాల్లో సమ్మె వస్తే అప్పుడు చూడాలి వాళ్ళ అసలు రంగు!"

"ప్రజల్ని మా మీదకు ఉసిగొల్పితే సమ్మె నీరుకారి పోతుందని ప్రభుత్వ భావన! కాని ప్రజలు మామీదకు రాలేదు! మమ్మల్నే బలపరుస్తున్నారు!" ధీమాగా అన్నాడు శంకరయ్య

# ఒక కుందేలు కథ


"కాలేజీ కుర్రాళ్ళు నిన్న ఘెరావ్ చేసి జేబులో పర్సు లాక్కున్నప్పుడు చుట్టూ మూగిన జనం ఎవర్ని సమర్థించారు? చోద్యం చూసి పోయారు తప్ప కలగజేసుకున్నారా? ఈదేశ ప్రజలు అంతే ఎదురుగా హత్య జరుగుతున్నా పట్టించుకోరు! నిజంగా నీకు ప్రజాభిప్రాయమే తెలుసుకోవాలని వుంటే నాతోరా! చెవులారా విందువుగాని – వాళ్ళు గుమాస్తాలను ఎంతగా అసహ్యించుకుంటున్నారో! . . నీతిమంతులెవరూ మిమ్మల్ని సమర్థించరు! ప్రభుత్వాన్ని పడగొడతాం అనే వాళ్ళని ఏమని పిలవాలి? దేశద్రోహులా? రాష్ట్రద్రోహులా? బాధ్యతల్ని విస్మరించి హక్కుల కోసమే పోరాడేవాళ్ళను ఎలా పిలవాలి? సంఘద్రోహులా? స్వార్థపరులా?"

ఒక్కసారిగా అసహ్యం పెల్లుబికింది శంకరయ్యలో ఎదురుగా కనిపిస్తున్న నిజాన్ని ఒప్పుకోని మూర్ఖుడు! అడ్డంగా వాదించే వితండవాది! ఛీఛీ యిలాంటి కొడుకుతో వాదన ఏమిటి?! మంచి మర్యాదలేకుండా వాగుతాడు తండ్రిని "నీవు" అంటాడు! పరమశత్రువు కంటే నీచంగా అవమానిస్తాడు! కృష్ణ— చిన్నప్పుడెంత ముద్దుగా బుద్ధిగా ఉండేవాడు! ఇప్పుడెందుకిలా తయారైనాడు?

యౌవనం! వ్యక్తిత్వం!! – ఛీఛీ యువతరం చెడిపోతోంది చీదరించుకొని లోనికిపోయాడు శంకరయ్య

సమ్మె ఉధృతం అవుతోంది సంఘ నాయకుడుగా క్షణం తీరికలేకుండా తిరుగుతున్నాడు శంకరయ్య ఇంటికి ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళతాడో ఆయనకే తెలియదు

కృష్ణ దినచర్య కూడా మారింది ఉదయం అంతా యింట్లోనే వుంటాడు




సాయంకాలం నాలుగయితే చాలు వెళ్ళిపోతాడు అర్ధరాత్రిగాని యింటికి రావడంలేదు ఒక్కోసారి తెల్లవారేక వస్తున్నాడు కృష్ణ చెడిపోతున్నాడని పార్వతమ్మ భయం కాని కొడుకుని నిలదీసి అడగలేదు తండ్రినే అవమానించే కొడుకు — తల్లిని గౌరవిస్తాడా? చెబుదామంటే భర్త యింటి పట్టునే ఉండడంలేదు ఎలా చచ్చేది? అని బాధపడేది పార్వతమ్మ

సమ్మె ముగిసింది ఘనవిజయం సాధించినట్లు ఉప్పొంగిపోయారు ఎన్ జీ. వో. లు. మూడు రోజులుగా హైద్రాబాద్ లోనే వుండిపోయిన శంకరయ్య కొండంత ఉత్సాహంతో తిరిగి వచ్చాడు. ఈ క్షణంలో కొడుకు ముఖం చూడాలని మహా ఉబలాటంగా వుందతనికి కాని కృష్ణ యింటిలోలేడు ఆయన ఉబలాటం చల్లారిపోయింది అప్పుడు రాత్రి పది

కొడుకులో వచ్చిన మార్పు గురించి పార్వతమ్మ భర్తకు చెప్పకుంది దీర్ఘాలోచనలో మునిగిపోయాడాయన

పదకొండు దాటాక కృష్ణ నెమ్మదిగా తలుపు తట్టాడు అమ్మ తలుపు తెరవగా నిశ్శబ్దంగా లోనికివచ్చాడు

"ఇంత రాత్రివరకూ ఏం చేస్తున్నావ్‌రా?"

గర్జించాడు శంకరయ్య

"ఒక అమ్మాయిని బ్లాక్ మెయిల్ చేస్తున్నా" సూటిగా వచ్చింది సమాధానం! ఆ స్వరంలో నదురూ బెదురూ లేదు ఖంగు తినేసాడు శంకరయ్య చివరకు తేరుకుని "ఒరేయ్! ఒరేయ్! ఇదేం పాడుబుద్ధిరా?! మన యింటా వంటాలేదు చెడబుట్టావురా త్రాష్టుడా! ఆడపిల్లని బెదిరించి డబ్బు గుంజుతున్నావా?"

"ఇంటా వంటా లేకపోవడం ఏమిటి నాన్నా? నీవు బ్లాక్‌మెయిల్ చేయలేదూ?"

"నేనా?!!"

"మా కోర్కెలు తీర్చకపోతే ప్రభుత్వాన్ని స్తంభింపచేస్తాం అని బెదిరించి సాధించారుగా! అది బ్లాక్‌మెయిల్‌కాదా?"

అంత కోపంలోనూ — కొడుకు తమ సమ్మె విజయం గుర్తించినందుకు కాస్త సంతోషమే కలిగింది శంకరయ్యకు!

మర్నాడు — తమ విజయాన్ని పురస్కరించుకొని పార్టీ చేసుకొని ఎన్ జీ వో లందరూ సినిమాకు వెళ్ళారు ఇంటర్వెల్‌లో బయటకు వస్తూనే కొడుకుని, వాడు చేస్తున్న పనినీ చూసి షాక్ తిన్నాడు శంకరయ్య చుట్టూవున్న మిత్రులు ఎగతాళిగా నవ్వుతోంటే తల వంచుకున్నాడు ఇక సినిమా చూడలేక యింటికిపోయి భార్యమీద చిందులేసాడు "వాడు నా కొడుకా?! నా శత్రువు! నికృష్టుడు! త్రాష్టుడు!"

ఆ తిట్లకు అంతూ పొంతూ లేదు —

పదుకొండున్నరకి కృష్ణ యింటికి వచ్చేవరకూ తిట్లవర్షం కురుస్తూనే వుంది

కృష్ణ గుమ్మంలో అడుగు పెట్టగానే —

''ఆగక్కడ! లోనికి వచ్చావో మర్యాద దక్కదు! ఫో బయటకు! నీ ముఖం నాకింక చూపించకు'' గర్జించాడు శంకరయ్య.

లోనికి వేస్తున్న అడుగు బయటకు తీసుకుని గిరుక్కున వెనక్కి తిరిగి చరచర వెళ్ళిపోయాడు కృష్ణ!

హటాత్తుగా జరిగిన ఆ సంఘటనకు పార్వతమ్మేకాదు, శంకరయ్య కూడా దిమ్మెర పోయీరు కృష్ణ పట్టుదల యిద్దరికీ తెలుసు కృష్ణ యిక ఈ యింటికి రాడా? శాశ్వతంగా తెగతెంపులు చేసుకున్నాడా?!

జరిగిన సంఘటన నమ్మశక్యంగా లేదు వాళ్లకు

*　　*　　*

మర్నాడు శంకరయ్య ఆఫీసుకి వెళ్ళాక రఘు బయలుదేరి అన్న కృష్ణ ఎక్కడ ఉంటున్నాడో వాకబు చేసి వచ్చాడు కుమిలిపోతున్న తల్లికి ధైర్యంచెప్పి అక్కడకు తీసుకునివెళ్లాడు.

అదొక పెద్దగది ఒకవైపు మంచం, చిన్న సూటుకేసు, మరోవైపు కిరాణాసామాను పొట్లాలు ఒక మూల రుబ్బురోలు దాని ముందు కూచుని కృష్ణ—పప్పు రుబ్బుతున్నాడు!

''ఏమిటి బాబూ అది?!'' డగ్గుత్తికతో అడిగింది పార్వతమ్మ.

''శనగపప్పు అమ్మా! . రుబ్బుతున్నా'' నవ్వేశాడు కృష్ణ.

పార్వతమ్మ కన్నీరు పెట్టుకుంది

''నేను తప్పపని చేస్తున్నానా అమ్మా?'' నెమ్మదిగా అడిగాడు.

అమ్మ సమాధానం చెప్పలేదు.

''అలా మంచం మీద కూర్చోండి'' అన్నాడు రుబ్బడం ఆపి

''అంత పప్పు రుబ్బుతున్నావెందుకు బాబూ?''

తల్లికి అసలు విషయం తెలియదని గ్రహించాడు కృష్ణ. లేచి, గది ప్రక్కనే వున్న సందులోనికి వాళ్లని తీసుకెళ్లాడు

అక్కడ నాలుగు చక్రాల తోపుడు బండి వుంది దానిమీద ఒక చివర కిరోసిన్ స్టౌవ్, స్టౌవ్‌మీద పెద్ద మూకుడు ఉన్నాయి

ఆ బండి ఏమిటో గుర్తించిన పార్వతమ్మ కొడుకు చేస్తున్న పని ఏమిటో గ్రహించింది! దీర్ఘంగా నిట్టూర్చి ''నీకీ ఖర్మ ఎందుకు బాబూ!'' అంది జాలిగా

''దీన్ని నేను కర్మ అనుకోవడం లేదమ్మా! ఈ రోజుల్లో ఉద్యోగం దొరకడం కష్టమే దొరికినా— ఆమ్యామ్యా కోసం అర్రులు చాచే వాళ్ళు, పని ఎగగొట్టి తిరిగేవాళ్ళూ, పని చేయకుండానే జీతం గుంజేవాళ్ళూ, చేయని పని కోసం జీతం పెంచమని సమ్మె చేసేవాళ్ళూ—ఆ ఆఫీసు వాతావరణం నాకు సరిపడదమ్మా! ఆఫీసుల్లో ప్రజాధనం ఎంత దోపిడీ అవుతోందో చూస్తే తల తిరుగుతుంది ఆఫీసులో చేరి ఆ దోపిడీలో భాగం పంచుకోలేను వాళ్ళని ప్రభుత్వం దారిలో పెడుతుందని ఆశించాను ఈ ప్రభుత్వమే కాదు, ఏ ప్రభుత్వమూ— ఈ పని దొంగల్ని, ప్రజాధనాన్ని దోపిడీ చేసే తెల్ల కాలర్ పెద్దమనుషుల్నీ— దారిలో పెట్టలేదని నిరూపణ అయింది'' అన్నాడు నిస్పృహగా కృష్ణ

కొత్తగా అర్థం అయిన వ్యక్తిని చూసినట్టు కొడుకుని చూసింది పార్వతమ్మ ఆ చూపులో గౌరవం, వాత్సల్యం నిండుగా వున్నాయి

''ఆఫీసుల్లో అందరూ అలా వుండరుకదా! నీమట్టుకు నీవు న్యాయంగా నీ పని చేసుకోవచ్చు కదా!'' అంది పార్వతమ్మ

''ఈ ఆఫీసు సంగతి నీకు తెలియదమ్మా! ఎగ్గొట్టి తిరిగే పందికొక్కుల పని నోరులేని కుందేళ్ళ నెత్తిమీద పదుతుంది తిట్లు, దీవనలు, అరవచాకిరీ— కుందేళ్ళకు! జీతం మాత్రం పందికొక్కులకు! పందికొక్కుల మధ్య కుందేళ్ళు బ్రతకలేవమ్మా! అందుకే ఉద్యోగం





నిష్పాక్షిక వార్తలకు, అందరికి పనికివచ్చే వైవిధ్యంగల వ్యాసాలకు —— ఆంధ్ర పత్రిక —— పెట్టింది పేరు. ఆదివారం అనుబంధం ఇంటిల్లిపాదికి ఆనంద ప్రదాయిని.

చదవండి...చదివించండి... మీ కాపీకై ఏజంట్‌కు చెప్పండి. లేదా మాకు.



మానేజర్; గాంధీనగర్; విజయవాడ-3కి గాని

మానేజర్; బషీర్‌బాగ్; హైద్రాబాద్-29కి గాని

వ్రాయండి.



# వంటలు

## బూతాంగ్

కావలసిన సరుకులు — లేత కొబ్బరి బొండం — ఒకటి, జీడిపలుకులు — ఆరు, ద్రాక్షపండ్లు (ఎండువి) — ఆరు, బాదం పలుకులు — ఆరు, పిస్తాపప్పులు — ఆరు, చారపప్పులు — పది

తయారుచేయు పద్ధతి — ముందుగా పైన రాసిన పప్పులన్నీ సన్నగా చాకుతో ముక్కలు చెయ్యాలి తర్వాత కొబ్బరిబోండాన్ని పగులకొట్టి నీటిని లోపలి గుజ్జుని తీస్కొని ఉంచాలి. గుజ్జుని, నీటిని బాగా కలిసేట్టు కలపాలి

ఒక గ్లాసులో కొద్దిగా అంటే అరస్పూను చెక్కెరవేసి, దాంట్లో మెత్తగా కలిపిన గుజ్జుని, నీటితోసహా కొద్దిగా పోసి, తరిగిన పప్పులను కొంచెం వెయ్యండి మళ్ళీ గుజ్జునీరు పోసి చెంచాతో ఒకసారి కలుపుకోవాలి. కావల్సినవారు రెండు ఐస్ ముక్కల్ని వేసుకోవచ్చు ఇది ఫిలిప్పైన్ వారు త్రాగే సాఫ్ట్ డ్రింక్ వేసవి కాలంలో ఆరోగ్యానికి ఎంతో మంచిది

— వి. వి. రమణ

## మైసూర్ దోసె

కావలసిన వస్తువులు — బియ్యం — రెండు కప్పులు, కొబ్బరికాయ (చిన్నది)— 1, పచ్చిమిరపకాయలు — 5, బెల్లం ముక్క — చిన్నది, దోసకాయ — 1, ఉప్పు — తగినంత, కొత్తిమీర— రెండు కట్టలు

చేసే విధానం — బియ్యంను నీటిలో అయిదు లేదా ఆరు గంటలు నానబెట్టాలి నానిన పిండిలో తురిమి ఉంచిన కొబ్బరి, పచ్చి మిరపకాయలు, బెల్లం ముక్క వేసి బాగా మెత్తగా రుబ్బాలి. తరువాత దోసకాయను చిన్న, చిన్న ముక్కలుగా తరిగి దానిని కూడా మెత్తగా రుబ్బి ముందుగా తయారుచేసి ఉంచిన పిండిలో వేసి బాగా దోసెల పిండిలాగా కలపాలి ఉప్పును, కొత్తిమీరను పిండిలో కలపవలెను. స్టవ్‌మీద పెనం పెట్టి దోసెలు పోయాలి. దీనిని వెన్నతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది ఈ వంటకాన్ని కర్నాటక ప్రాంతం వారు ఎక్కువగా చేస్తూ ఉంటారు.

— లక్ష్మి పి

## అరటిపండు చపాతీలు

కావలసిన వస్తువులు — బాగా మాగిన అరటిపండ్లు మూడు, గోధుమపిండి 200 గ్రాములు, చక్కెర 100 గ్రాములు, తగినన్ని జీడిపప్పు, ఎండుద్రాక్ష, తగినన్ని పాలు, నెయ్యి 200 గ్రా, చిటికెడు ఉప్పు, ఏలక్కాయలు రెండు

తయారుచేయు విధము — ముందుగా అరటిపండ్లకు పైపొట్టు తీసేసి చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. జీడిపప్పు, ఎండు ద్రాక్షలను కూడ సన్నని ముక్కలుగా తరగాలి గోధుమ పిండిని జల్లించి అందులోకి కొంచెం నెయ్యి, అరటిపండ్ల ముక్కలు, జీడిపప్పు ముక్కలు, ఎండుద్రాక్ష ముక్కలు, చిటికెడు ఉప్పు, ఏలక్కాయల పొడి వేసి బాగా కలపాలి తర్వాత పాలల్లోకి చక్కెరను పోసి బాగా కలిపి కరిగించాలి. ఈ పాలను గోధుమపిండి మిశ్రమంలోకి కొద్ది కొద్దిగా పోస్తూ బాగా పిసికి చపాతీల పిండిలా కలిపి వుంచుకోవాలి. పిండిని కాస్సేపు నాననివ్వాలి తర్వాత ఈ పిండితో చపాతీలు వత్తుకోవాలి వీటిని కాలుతున్న పెనంపై వేసి రెండు వైపులా నేతితో కాల్చి తింటే చాలా రుచిగా వుంటాయి. పిల్లలు ఇష్టంగా తింటారు

— శ్రీమతి గార్ల సరస్వతి

## బ్రెడ్ పుడ్డింగ్

కావలసిన వస్తువులు —

బ్రెడ్ : 1 పాకెట్, పాలు పావు లీటరు, చక్కెర . 500 గ్రా, పల్చటి కోవా: 250 గ్రా, సారపప్పు 10 గ్రా, కిస్‌మిస్ 5 గ్రా

చేయు విధానం :—

మొదట బ్రెడ్ స్లైస్‌లను నెయ్యితో దోరగా పెనంమీద వేయించుకొనవలెను వేగిన బ్రెడ్‌ను పాలలో నానవేయవలయును. చక్కెరను చిక్కగా పాకంలా తయారు చేసుకొని నానిన బ్రెడ్ స్లైస్‌లపై పోయవలయును పాకం స్లైస్‌లకు బాగా పట్టిన తరువాత ఒక్కొక్క స్లైస్‌ను తీసికొని ఇరువైపులా కోవాను పూసి ఒక పెద్ద పళ్ళెంలో విడివిడిగా స్లైస్‌లను వుంచి మూతపెట్టి సన్నటి సెగతో వుడకనివ్వాలి దింపిన తరువాత ఈ స్లైస్‌లపై సారపప్పును, కిస్‌మిస్‌లను డేకరేట్ చేయవలెను వేడి వేడిగా తింటే ఎంతో రుచి

— బి. శ్యామ

## సోవియా కేక్

కావలసిన వస్తువులు —

మైదాపిండి—2 టేబుల్‌స్పూన్స్, పెరుగు— 1 స్పూన్, నీళ్ళు—5 స్పూన్స్, చక్కెర — పావుకిలో, నెయ్యి—అరకిలో

చేయు విధానము — అరకేజి నెయ్యిలో సగము నెయ్యి కాచి ప్రక్కన ఉంచాలి పైన చెప్పిన కొలతలలో మైదాపిండి, పెరుగు, నీళ్ళు, చక్కెర, నెయ్యి కలిపి ఒక దళసరి గిన్నెలో వేసి అడుగంటకుండా కలిపి, ఇంకు తున్నప్పుడల్లా నెయ్యిపోస్తూ ఉండాలి. కొంచెము బ్రౌను కలరులో స్వీట్ గట్టిపడుతుండగా, నెయ్యి రాసిన ప్లేటులోకి కుమ్మరించవలెను ఈస్వీట్‌లో చాలావరకు నెయ్యి బయటకు వచ్చేస్తుంది కనుక, ఆ నెయ్యి తిరిగి మనం వేరే స్వీట్‌కు ఉపయోగించుకోవచ్చు.

— పి. సవిత ★

చేయదలచుకోలేదు నేను. అందుకే నాస్నేహితుని రికమెండేషన్‌మీద బ్యాంక్ ఋణం తీసుకున్నా. వారం రోజుల క్రితమే ఈ వ్యాపారం మొదలు పెట్టాను. ఇందులో మోసం చేయకుండా, దోపిడీ చేయకుండా బ్రతకగలనని అనుకుంటున్నా. ఆ బండిమీద— వేడి వేడి పకోడీ, మసాలావడ లాంటివి అప్పటికప్పుడు చేసి అమ్ముకుంటున్నా సాయంకాలం పార్కువద్ద...రాత్రి సినిమా హాళ్ల వద్ద— నిన్న నాన్న నన్ను చూశారు . అందుకే ఆ చిందులు ! ఆయనలా నేను ప్రజా ధనం దోచుకోడంలేదు ఆయనకంటే గౌరవప్రదంగానే జీవిస్తున్నానని నా భావన...'' తండ్రిని తిడుతు

## ఒక కుందేలు కథ

న్నందుకు తల్లికి కోపం వచ్చిందేమోనని ఆమె వైపు ఒకసారి చూసాడు కృష్ణ. ఆమె ముఖం ప్రసన్నంగా వుంది !

సందులోంచి అందరూ గదిలోనికి వచ్చేసారు

''ఈ ఊళ్ళో ఎంతమంది తిండిబోతు లున్నారో, వాళ్ళు— రుచిగా, శుచిగా వుండే తినుబండారాల కోసం ఎలా ఎగబడతారో నీవు చూసి తీరవలసిందేగాని చెబితే నమ్మవు. రెండు రూపాయల వడలు అలా నిలుచుని తినేసే వాళ్ళున్నారు ! రోజూ పాతికరూపాయలపైనే లాభం వస్తోంది శలవు రోజుల్లో అయితే మరీ ఎక్కువ మరో రెండేళ్ళలో చిన్న హోటల్ పెడతాను ఇంకో ఐదేళ్ళకు పెద్ద హోటల్ అప్పుడు కాలుమీద కాలేసుకుని దర్జాగా బ్రతకవచ్చు ''

భవిష్యత్తు గురించి ఉత్సాహంగా చెబుతూ హఠాత్తుగా టైమ్ చూసుకున్నాడు కృష్ణ.

''అయ్యో ! మ్యాట్నీ సినిమాకు టైమ్ అవుతోంది'' అంటూ కంగారుగా రుబ్బురోలు ముందు కూర్చున్నాడు.

''లే బాబూ ! నేను రుబ్బుతాను'' అంది పార్వతమ్మ నిశ్చలంగా. ★